

02లో

## డబ్బుల కోసం కన్న తండ్రిని హత్య చేసిన కుమారుడికి జీవిత ఖైదు

- రాజాపూర్ హత్య కేసులో నిందితుడికి రూ.5 వేల జరిమానా..

- పోలీసు అధికారులను అభినందించిన ఎస్పీ జానకి


జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట

శనివారం సెప్టెంబర్ 26, 2026 పేజీలు:12


# గంగమ్మ ఒడికి గణపయ్య



చిన్నంబావి సెప్టెంబర్ 25(ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామంలోని బొడ్రాయి గణేష్ యూత్ ఆధ్వర్యంలో 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడిని చేరాడు. శుక్రవారం గణేష్ నిమజ్జనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. భాజభజంత్రీలు, మంగళ వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ మహిళలు యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ, మహిళలు కోలాటాలతో సందడి చేస్తూ గణనాథులను ఊరేగింపుగా తరలించారు. పోయిరా బొజ్జ గణపయ్య అంటూ భక్తులు స్వామివారికి వీడ్కోలు పలికారు. పెద్దమారూర్ గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా గణనాథుల శోభాయాత్ర సాగింది. కృష్ణానది వద్దకు తరలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సహాయంతో గణనాథులను నిమజ్జనం చేశారు. బొడ్రాయి గణేష్ ఉత్సవ కమిటీ, ఆధ్వర్యంలో నిర్వాహకులకు స్వాగతం పలుకుతూ. నిమజ్జన శోభాయాత్రలో పాల్గొని గణనాథులకు స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘనటలు చోటు చేసుకోకుండా అంగరంగ వైభవంగా సాగనంపారు. భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

మొదటిపేజీ తరువాయి

# డబ్బుల కోసం కన్న తండ్రిని హత్య చేసిన కుమారుడికి జీవిత ఖైదు

- రాజాపూర్ హత్య కేసులో నిందితుడికి రూ.5 వేల జరిమానా..

- పోలీసు అధికారులను అభినందించిన ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 25 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

డబ్బుల కోసం కన్న తండ్రితో తరచూ గొడవపడుతూ, ఆయనను హత్య చేసిన కుమారుడికి మహబూబ్‌నగర్ న్యాయస్థానం జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. నిందితుడు కవాలి నదేశ్ అలియాస్ ఆనంద్‌కు సాధారణ జీవిత ఖైదుతో పాటు రూ.5,000 జరిమానా విధించింది.రాజాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయపల్లి గ్రామంలో 2024 సెప్టెంబర్ 19న ఈ హత్య జరిగింది. డబ్బుల విషయంలో తల్లిదండ్రులతో గొడవపడిన నదేశ్ అలియాస్ ఆనంద్ తన తండ్రి కవాలి నారాయణపై గొడ్డలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన నారాయణను కుటుంబ సభ్యులు జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేకలు విని ఇంట్లోకి వెళ్లిన మృతుడి భార్య కవాలి చంద్రకళ తన భర్తపై కుమారుడు దాడి చేస్తున్నట్లు గుర్తించింది. అనంతరం ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### సమర్థవంతమైన దర్యాప్తుతో నిందితుడికి శిక్ష:

ఈ కేసులో జడ్చర్ల రూరల్ సీఐ టి. నాగార్జున గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడిపై న్యాయస్థానంలో అభియోగాలు రుజువయ్యేలా ఆధారాలను సమర్పించారు.తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుండగా, ఎలాంటి పని చేయకుండా ఉన్న నిందితుడు డబ్బుల కోసం వారితో తరచూ గొడవపడేవాడని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసులు తెలిపారు. మహబూబ్‌నగర్ ఫ్యామిలీ కోర్టు కమ్ ××× అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి పి. ఆంజనేయులు శుక్రవారం నిందితుడికి సాధారణ జీవిత ఖైదు, రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

### పోలీసు అధికారులకు ఎస్పీ అభినందనలు:

కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన జడ్చర్ల రూరల్ సీఐ టి. నాగార్జున గౌడ్, కేసు నమోదు చేసిన ఎస్ఐ రవి, ఏపీపీ కె. నరేష్ కుమార్, జె. శ్రీనివాస్, హెచ్‌సీ-160, ఫ్యామిలీ కోర్టు లైజన్ అధికారి, సీడీఓ జె. శేఖర్, పీసీ-2177 తదితరులను జిల్లా ఎస్పీ దరావత్ జానకి అభినందించారు. నేరాలకు పాల్పడే వ్యక్తులకు చట్ట ప్రకారం శిక్ష పడేలా దర్యాప్తు, న్యాయ ప్రక్రియలో పోలీసు శాఖ సమన్వయంతో పనిచేస్తుందని ఎస్పీ పేర్కొన్నారు.

# విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ద్విచక్ర వాహనం.. వ్యక్తి మృతి

**ఆలంపూర్ సెప్టెంబర్ 25(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

గద్వాల మున్సిపాలిటి పరిధిలో నదీఅగ్రహారం రోడ్డులో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గద్వాల పట్టణం చింతలపేటకు చెందిన మునగాల శీను(54) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి ఈశ్వరన్నకు తీవ్రగాయలయ్యాయి. నదీ అగ్రహారం నుంచి గద్వాల వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వీరి బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన శీను(54) అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ఈశ్వరన్న ను గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న యువ నాయకులు ముత్యాల రవి గద్వాల జిల్లా ఆసుపత్రిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాడ సానుభూతి తెలియజేశారు. అలాగే తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఈశ్వరన్నకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.



# భగవాన్ అనంత పద్మనాభ స్వామి వ్రతంలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ,బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు శ్యామల హనుమంతు నాయుడు

**ఆలంపూర్ సెప్టెంబర్ 25(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలం పెద్ద చింతరేవుల గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో పెద్ద చింతరేవుల అన్నప్రసాద ట్రస్ట్ సత్రంలో చాతుర్మాస దీక్షల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉడిపి పలిమార్ మఠం పీఠాధిపతులు 1008 విద్యాధీశ తీర్థ శ్రీపాదులు వారు,విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదులు వారిచే నిర్వహించిన భగవాన్ అనంత పద్మనాభ స్వామి వ్రతం కార్యక్రమంలో పాల్గొని, ఆంజనేయ స్వామి వారికి అభిషేకం మరియు మూల రాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం బాసు శ్యామల హనుమంతు నాయుడ ని పీఠాధిపతులు ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని బహుకరించి,శాలువతో సత్కరించి,ఆశీర్వదించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉడిపి పలిమార్ మఠం పీఠాధిపతులు 1008 విద్యాధీశ తీర్థ శ్రీపాదులు వారు,విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదులు వారిచే చాతుర్మాస దీక్షల నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉంది అని అన్నారు. అదేవిధంగాఆంజనేయస్వామి మరియు ఉడిపి పలిమార్ మఠం పీఠాధిపతుల ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో అల్లపాడు ప్రతాప్, చక్రీధర్ రెడ్డి,లక్ష్మీకాంత్ రెడ్డి,వెంకటేష్ నాయుడు,తిమ్మప్ప గౌడ్,జాంపల్లి భరత్ సింహారెడ్డి,ముని రెడ్డి,డ్యామ్ శ్రీను,చంద్రశేఖర్,మణివర్ధన్ రెడ్డి, వెంకటేష్ యాదవ్,అంజి,మాలిక్, గంగాధర్,అరవిందు,సవరన్న,మరియు నాయకులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.....





# ఎంబి.బిఎస్ మాల పావని భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ప్రజా సంఘాల నాయకులు





**ఆలంపూర్ సెప్టెంబర్ 25(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణ కేంద్రంలో 9వ వార్డు కు చెందిన అయిజ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాల నర్సింహులు గారి తమ్ముడు మాల చింతలన్న కూతురు పావని ఎంబీ.బీఎస్ పాలమూరు జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. కానీ అంతలోనే 20 గత కొన్ని రోజులుగా హైదరాబాదు నందు బ్రెయిన్ డెడ్ తో నిమ్స్ హాస్పటల్లో చికిత్స పొందుతూ నిన్న సాయంత్రం 4 గంటల సమయంలో మరణించడం జరిగింది. ఇట్టి విషయం తెలుసుకొని ఈరోజు ఉదయం అయిజ మున్సిపల్ వైస్ చైర్మన్ మాల నర్సింహులు నివాసానికి చేరుకొని పావని భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ మనోధైర్యశీ చెప్పారు, ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మెడికల్ తిరుమలరెడ్డి , మాజీ టిడిపి నాయకులు అంజిబాబు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆంజనేయులు , ఎస్పి హనుమంతు రియల్ ఎస్టేట్, ఉప్పల దేవన్న మాదిగ, తెలంగాణ ఉద్యమ ఫోరం అధ్యక్షుడు మిట్టదొడ్డి నరసింహులు, డాక్టర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి బాధ్యతను మరింత పెంచుతుంది:జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు

**గద్వాల సెప్టెంబర్ 25(ప్రజా జ్యోతి ప్రతినిధి):**



జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె.గోపాల్‌కు ఏఎస్సైగా పదోన్నతి లభించింది.మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతి అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్వయంగా గోపాల్‌కు స్టార్స్ తొడిగి అభినందనలు తెలిపారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ,ఉద్యోగ జీవితంలో పదోన్నతి అనేది కేవలం పదవిలో ఎదుగుదల మాత్రమే కాదని,అదే సమయంలో బాధ్యతలు మరింత పెరుగుతాయని అన్నారు.పదోన్నతి ద్వారా కొత్త ఉత్సాహం,మరింత నిబద్ధత, సేవాభావంతో విధులు నిర్వహించాలని సూచించారు.పోలీసు విధులు నిర్వర్తించే సమయంలో ఆరోగ్యాన్ని కూడా సమానంగా కాపాడుకోవాలని ఎస్పీ సూచించారు. శారీరకంగా,మానసికంగా దృఢంగా ఉంటే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు.ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి పోలీసు సిబ్బంది ప్రధాన బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు.



## పావని భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన

### ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు

### అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్

**ఆలంపూర్ సెప్టెంబర్ 25(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం లో అయిజ పట్టణ కేంద్రంలో 9వ వార్డు కు చెందిన అయిజ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాల నర్సింహులు తమ్ముడు మాల చింతలన్న కూతురు పావని (20) గత కొన్ని రోజులుగా హైదరాబాదు నందు నిమ్స్ హాస్పటల్లో చికిత్స పొందుతూ నిన్న సాయంత్రం 4 గంటల సమయంలో మరణించడం జరిగింది,ఇట్టి విషయం తెలుసుకున్న ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు స్వయంగా ఆయన వైస్ చైర్మన్ మాల నర్సింహులు నివాసానికి చేరుకొని పావని భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ మనోధైర్యశీ చెప్పారు, ఎమ్మెల్యే వెంట బి .ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ వేమారెడ్డి , మాజీ వైస్ చైర్మన్ , ప్రస్తుత కోఆప్షన్ నెంబర్ నాగన్న గౌడ్ , కో ఆప్షన్ నెంబర్ మౌల గారు, కౌన్సిలర్ శివ , డాక్టర్ కృష్ణ , బి ఆర్ .ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భద్రయ్య , జోల్లబ్బాయి , బిఆర్ఎస్వి అయిజ మండల అధ్యక్షుడు మత్తలి , లెనిన్ బాబు , అశ్వ మారెప్ప గారు, వడ్ల వీరేష్ , నరేష్ , వీరేష్ , నాగరాజు ,బి ఆర్ .ఎస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు





# అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్





**నాగర్ కర్నూల్ : 25 సెప్టెంబర్ (ప్రజా జ్యోతి)**

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పెంట్లవెల్లి మండలం వేంకల్ మల్లేశ్వరం గ్రామంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ శుక్రవారం పర్యటించి పలుఅభివృద్ధి పనులను పరిశీలించి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనఖీచేసి చిన్నారులకు అందుతున్న సేవలు,మౌలిక వసతులు,తాగునీరు, పారిశుధ్యం ఆరోగ్య సంరక్షణ,ప్రీ-స్కూల్ విద్యవంటి సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చిన్నారులకు సురక్షితమైన,ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు.అంగన్వాడికి సొంత భవనం మంజూరు చేయాలని గ్రామ ప్రజలు జిల్లాకలెక్టర్ కు విజ్ఞప్తి చేయడంతో సానుకూలంగా స్పందించిన కలెక్టర్ అంగన్వాడి భవనానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించి ప్రతిపాదనలను పంపాలని అధికారులకు సూచించారు.అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న వివో భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి నిర్మాణ పనుల ప్రస్తుత పురోగతి,ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను అధికారుల నడిగితెలుసుకుని నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.నిర్మాణంలో ఉపయోగించే మెటీరియల్ నాణ్యతను పరిశీలించి పనులను పర్యవేక్షిస్తూ నిర్దేశిత ప్రమాణాల మేరకు నిర్మాణం జరిగేలా చూడాలని, పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ భవనాల నిర్మాణంలో నాణ్యతతో పాటు పనుల వేగానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం వేంకల్ గ్రామములో కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ రీ సర్వే పనుల పురోగతి,ఇప్పటివరకు చేపట్టిన సర్వే వివరాలు భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని,రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా పకడ్బందీగా,తప్పులు లేకుండా నిర్వహించాలని,భూ యజమానులకు ఇబ్బందులు కలగకుండా వారికి అవసరమైన సమాచారం అందిస్తూ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని,ప్రభుత్వ,అటవీ భూములతో పాటు ప్రజల పట్టాభూముల వివరాల నమోదును హద్దుల నిర్ధారణ తదితర అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని, రీ సర్వే పూర్తయిన అనంతరం భూ రికార్డులు మరింత స్పష్టంగా, కచ్చితంగా ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ,మౌలిక వసతుల పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు మె రుగైన సేవలందెలా చర్యలు తీసుకోవాలని జిల్లా

# స్వయంభు తిమ్మప్ప స్వామి దేవస్థానంలో ఘనంగా శ్రీ అనంతపద్మనాభ స్వామి వ్రతం

**మల్దకల్ సెప్టెంబర్ 25(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వయంభూగా వెలిసిన శ్రీ అనంతపద్మనాభ స్వామి వ్రతాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.దేవాలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహల్లాద రావు,ఈఓ సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో అనంత పద్మనాభ స్వామి వ్రతాన్ని అర్చకులు మధుసూదనాచారి రమేష్ రవి వాల్మీకి పూజారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారి తోర పూజ నిర్వహించి భక్తులకు అందజేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని స్వామివారి మొక్కులు తీర్చుకున్నారు.



# శివనంపల్లి మోడల్ జీపీగా ఎంపిక.. వికసిత గ్రామ పంచాయతీ ప్లాన్‌కు శ్రీకారం

**ఇటిక్యాల,(ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 25:**

జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని శివనంపల్లి గ్రామ పంచాయతీని మోడల్ గ్రామ పంచాయతీగా ఎంపిక చేసి వికసిత గ్రామ పంచాయతీ ప్లాన్ రూపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.ఈ మేరకు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు శివనంపల్లి గ్రామ పంచాయతీలో సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశంనిర్వహించనున్నారు.గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి,పారిశుద్ధ్యం,తాగునీరు,విద్యుత్,రహదారులు,విద్య, వైద్యం తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి,భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళికను రూపొందించనున్నారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు.





# మృత పోలీసు కుటుంబానికి అండగా జిల్లా ఎస్పీ

## - కార్పస్ ఫండ్ చెక్కులు అందజేత

**గద్వాల సెప్టెంబర్ 25(ప్రజా జ్యోతి ప్రతినిధి)**

:విధి నిర్వహణలో ఉండగా మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు తెలిపారు.హార్ట్ స్ట్రోక్ కారణంగా 22.12.2020న మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ శ్యామప్ప కుటుంబ సభ్యులకు కార్పస్ ఫండ్ కింద శు క్రవారం జిల్లా ఎస్పీ చెక్కులు అందజేశారు.ఇందులో భాగంగా గత నెలలో శ్యామప్ప రెండో భార్య మనోర,కుమారుడు తేజకు ఒక్కొక్కరికి రూ.12,450 చొప్పున రెండు చెక్కులు అందజేయగా,ప్రస్తుతం మొదటి భార్య కుమారుడు పి.కె.శ్రీకర్,శ్యామప్ప తల్లి నాగమ్మకు ఒక్కొక్కరికి రూ.12,450 చొప్పున చెక్కులను అందించారు.దీంతో కార్పస్ ఫండ్ కింద కుటుంబ సభ్యులకు అందించిన నాలుగు చెక్కుల మొత్తం రూ.48,000గా ఉంది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం,పోలీస్ శాఖ ద్వారా అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు.కుటుంబ సభ్యులకు అందాల్సిన మిగిలిన ప్రయోజనాలను కూడా త్వరితగతిన అందించేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల శాఖ నిరంతరం బాధ్యతతో వ్యవహరిస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో సాయి కృష్ణ,కార్యాలయ సూపరింటెండెంట్ నాగమణి, జూనియర్ అసిస్టెంట్ గాయత్రీ,శ్యామప్ప కుటుంబ సభ్యులు పి.కె.శ్రీకర్,నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ నీటి నిర్వహణపై ఢిల్లీలో ప్రసంగించడం గర్వకారణం:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## - జాతీయస్థాయిలో జోగులాంబ గద్వాల జిల్లాకు గుర్తింపు

**గద్వాల,సెప్టెంబర్ 25(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

ఉత్తమ నీటి నిర్వహణపై ఢిల్లీలో ప్రసంగించే అవకాశం లభించడం ద్వారా జోగులాంబ గద్వాల జిల్లాకు జాతీయస్థాయిలో మరింత గుర్తింపు లభించిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్ వాటర్ వీక్‌లో భాగంగా ఈ నెల 24న కలెక్టర్ పాల్గొని జిల్లాలో చేపట్టిన ఉత్తమ నీటి నిర్వహణ కార్యక్రమాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఐడీఓసీలోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అధికార యంత్రాంగం తరఫున పలువురు అధికారులు కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,నీటి వనరులను సంరక్షించుకునేందుకు ప్రణాళికలు రూపొందించడంతో పాటు వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిరక్షించేందుకు ప్రజల భాగస్వామ్యంతో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.నీటి సంరక్షణ,సమర్థ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నీటి వనరులను కాపాడుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్,నర్సింగరావు,డీపీఓ శ్రీకాంత్,జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్,జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగేంద్రం,డీఐఈఓ హృదయ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



# 150వ వందేమాతరం వార్షికోత్సవం ఘనంగా నిర్వహణ

**ఆలంపూర్ సెప్టెంబర్ 25(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వేదనగర్‌లో శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఆధ్వర్యంలో 150వ వందేమాతరం వార్షికోత్సవ కార్యక్రమాన్ని స్వకులసాలి చేనేత భవన్ నందు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి యువ నాయకురాలు డాక్టర్ డీకే స్నిగ్ధ రెడ్డి, సరస్వతీ శిశు మందిర్ గద్వాల జిల్లా అధ్యక్షులు గోపాల్ రావు ఎగ్బోటే, జిల్లా ధర్మ ప్రచార సమితి అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ భారత మాతృభూమికి గౌరవం, జాతీయ ఐక్యత, దేశభక్తి భావాలను చాటిచెప్పేలా వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని, దేశభక్తి, జాతీయ ఐక్యత భావాలను ప్రజల్లో మేల్కొల్పిన గొప్ప గీతమని, నేటి విద్యార్థుల్లోనూ దేశభక్తి, జాతీయ భావన, ఐక్యతా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.అనంతరం విద్యార్థులు, ముఖ్య అతిథులు వందేమాతరం గీతాన్ని ఆలపించి మాతృభూమికి గౌరవం తెలిపారు. 150వ వందేమాతరం వార్షికోత్సవం విజయవంతంగా నిర్వహించిన సరస్వతీ శిశు మందిర్ నిర్వాహకులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాల విద్యార్థి, విద్యార్థినులు, బిజెపి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎగ్బోటే , బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, తదితర హిందూ బంధువులు, పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థి, విద్యార్థినిలు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ శిశు మందిర్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.




# పావని భౌతిక కాయానికి కాంగ్రెస్ పార్టీ నాయకుల నివాళులు

**ఆలంపూర్ సెప్టెంబర్ 25(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

అయిజ మున్సిపాలిటీలో 9వ వార్డుకు చెందిన అయిజ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాల నర్సింహులు తమ్ముడు మాల చింతలన్న కుమార్తె పావని (20) గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న సాయంత్రం 4 గంటల సమయంలో మృతి చెందడం జరిగిందిపావని మృతి విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి నివాసానికి చేరుకొని పావని భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ మహబూబ్ పాషా , కౌన్సిలర్లు ఎస్. మద్దిలేటి , చిన్నికృష్ణ , చేనేత సహకార సంఘం అధ్యక్షులు డాన్ వీరన్న , మాజీ కౌన్సిలర్ రాజు నారాయణ బోయ లక్ష్మన్న ,14 వార్డు ఇంచార్జీ మేస్త్రి శీను, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు మాల మల్లికార్జున్ , శైలజ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, రామంజి, నాగరాజు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అడ్వకేట్ కురువ వీరేష్ తదితరులు పాల్గొని పావని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు





# వయోవృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ - వయోవృద్ధుల ఆరోగ్యానికి వైద్య శిబిరం

**వనపర్తి, సెప్టెంబరు 25 (ప్రజాజ్యోతి):**





వయోవృద్ధుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా సంక్షేమ అధికారి కే. సుధారాణి సూచించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వనపర్తిలోని శ్రీ చౌడేశ్వరి ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సమన్వయంతో నిర్వహించిన శిబిరంలో వృద్ధులకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన వారికి వైద్య సలహాలు, మందులు అందించారు. ఆరోగ్య సమస్యలను సకాలంలో గుర్తించి తగిన వైద్యసేవలు అందించాలని సుధారాణి సూచించారు. వృద్ధులను గౌరవం, ఆదరణతో చూసుకోవడంతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు శిబిరంలో పాల్గొని వృద్ధులకు సేవలు అందించారు. అనంతరం వయోవృద్ధుల పట్ల గౌరవం, ఆదరణ, సేవాభావంతో వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు, ఓల్డ్ ఏజ్ హోమ్ సిబ్బంది, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

# రామ్ మందిర్ వినాయక హారతి పూజ లో పాల్గొన్న సర్పంచ్ హనుమంత రెడ్డి



**నర్వ సెప్టెంబర్ 25 ప్రజాదౌతి**

నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని రామ్ మందిరి వినాయక మండపంలో గురువారం రాత్రి జరిగిన నిత్య హారతి పూజా కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా గ్రామ సర్పంచ్, ప్రతిభ స్కూళ్ల కరస్పాండెంట్ టీ హనుమంత రెడ్డి పాల్గొన్నారు, ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం మంగళహారతి తో ముగించారు, అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు, ఇదేవిధంగా తోడు గణపతిని అందిస్తున్న దాతలు కోళ్ల దంపతులు శ్రీమతి మీనాక్షి కోల చెన్నప్పల, తో పాటు అన్నదాన దాతలను వినాయక చవితి ఉత్సవాల అందించిన వక్తలను అభినందించి వినాయక అమౌంట్ సన్మానించారు, ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు దండు అయ్యప్ప, గ్రామ ఉపసర్పంచ్ దండు అజయ్, గణేశు ఉత్సవ కమిటీ సభ్యులు ఆర్యన్ గ్రూపు యువకులు తదితరులు పాల్గొన్నారు

# పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలని పాదయాత్రను

## - అలంపూర్ నియోజకవర్గ జేఏసీ ఛైర్మన్ వై.రామ్మోహన్ డిమాండ్

**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 25:**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన సమితి అలంపూర్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ వై.రామ్మోహన్ డిమాండ్ చేశారు.శుక్రవారం ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలో స్థానిక రైతులతో కలిసి కొండ లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో పాదయాత్రకు సంబంధించిన కరపత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పిఆర్ ఎల్ఐ నీటిని నల్గొండకు తరలించే డిండి లిఫ్ట్ పథకాన్ని రద్దు చేయాలని,ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల నుంచి ఉండవల్లి, మానోపాడు,అలంపూర్ మండలాలకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని కోరారు.ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 27న దుందుబి నది ఒడ్డున ఉన్న ఉల్పార నుంచి కల్వకుర్తి వరకు పాదయాత్రనిర్వహిస్తున్నట్లుతెలిపారు.ఇష్టంగా పోరాడుదాం.మన వాటా మనం సాధించుకుందాం అనే నినాదంతో చేపట్టే పాదయాత్రను రైతులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు,ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.చంద్రసాగర్, అమ్రాబాద్,జూరాల, గట్టు,శేర్పల్లి ప్రాంతాల్లో లిఫ్ట్ పథకాలు నిర్మించాలని,జీవో 72తో తంగడి లిఫ్ట్ పథకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్,వెల్టూరు, గొందిమల్ల బ్యారేజీలను నిర్మించాలని.చిన్నోనుపల్లి రిజర్వాయర్ నుంచి ఆర్డీఎస్ కాలువకు సాగునీరు అందించాలని, 99, 100 ప్యాకేజీలను తక్షణమే పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి,సింగవరం-1 గొంగళ్లఈశ్వర్,కంచుపాడు మాజీ సర్పంచ్ శేషన్ గౌడ్,రైతులు రంగస్వామి, సుబ్బారెడ్డినరసింహ,హీరోజీ రావు,తదితరులు పాల్గొన్నారు.





# డ్రైడే నామమాత్రంగా చేయొద్దు

## - డెంగ్యూ నివారణకు పకడ్బందీ చర్యలు

## : కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, సెప్టెంబరు 25 (ప్రజాజ్యోతి):**

డెంగ్యూ, సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమాన్ని నామమాత్రంగా కాకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని రాంనగర్ కాలనీలో డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పరిసరాల్లో నీటి నిల్వలు, దోమల వృద్ధికి అనుకూల ప్రాంతాలను పరిశీలించి, తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ఇటీవల డెంగ్యూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్ల పరిసరాలు, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ పాత్రల్లో నీరు నిల్వ కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్య, మున్సిపల్ శాఖలు సమన్వయంతో దోమల నివారణ చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

### నాణ్యతతో ఇళ్ల నిర్మాణం

అనంతరం పట్టణంలోని నాలుగో వార్డులో కురుమమ్మ, ఎల్లమ్మ అనే లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, ప్రభుత్వ మార్గదర్శకాల అమలు, బిల్లుల చెల్లింపులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందేలా చూడాలని, నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులు అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేయకుండా చూడాలని సూచించారు. అవసరమైన రుణాలను స్వయం సహాయక సంఘాల ద్వారా పొందేలా అధికారులు సహకరించాలని తెలిపారు. ఇళ్ల పునాదులను అవసరానికి మించి ఎత్తుగా నిర్మించకుండా, నిర్దేశిత ప్రమాణాలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్, గృహ నిర్మాణ శాఖ పీడీ విఠోభా, కౌన్సిలర్లు పరశురాం, శరవంద, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి

## కొమిరెడ్డిపల్లి శివారులో ఘటన..

## డ్రైవర్‌పై కేసు నమోదు



**గండీడ్ (ప్రజా జ్యోతి), :**

ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గండిడ్ మండలం కొమిరెడ్డిపల్లి గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మదాబాద్ మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన కురువ మల్లేష్ (27), తండ్రి కిష్టయ్య, శుక్రవారం ఉదయం సుమారు 9.45 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై కోస్గి వైపు బయలుదేరాడు. మార్గమధ్యంలో కొమిరెడ్డిపల్లి గ్రామ శివారుకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు (టిఎ06 ఖజ 3213) అతని ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో మల్లేష్ తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్ దస్తయ్యపై మృతుడి భార్య రత్నమాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలి

: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 25 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ లైన్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో అందుతున్న విద్యాబోధన, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులను పరిశీలించారు. పాఠశాలలో పారిశుధ్య నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్, ఇదే విధంగా నిరంతరం పరిశుభ్రతను కొనసాగించాలని సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాలలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు.



# రోగులకు నాణ్యమైన సేవలందించడంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

- ఫార్మసీ అధికారుల సేవలను అభినందించిన

డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఏ. శ్రీనివాసులు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 25 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** ఆసుపత్రులు, ఆరోగ్య వ్యవస్థలో ఫార్మసీ అధికారుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ ఏ. శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్‌లోని పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రులు, ప్రజారోగ్య సేవలు సజావుగా కొనసాగడంలో ఫార్మసిస్టుల సేవలు ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు. ఫార్మసీ అధికారులు అంకితభావం, బాధ్యత, నిబద్ధతతో రోగులకు సేవలందించాలని సూచించారు. ఫార్మసీ అధికారులు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం ఫార్మసీ సూపర్‌వైజర్‌గా గతంలో విలువైన సేవలందించిన శ్రీమతి రాధాభాయిని గుర్తింపుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విద్య (సీహెచ్‌ఐ కోఆర్డినేటర్), డాక్టర్ శివకాంత్ (ఎంహెచ్‌ఎన్ నోడల్ అధికారి), జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) ఫార్మసీ అధికారులు పాల్గొన్నారు.




# ఉపాధి పనులపై 'సామాజిక తనిఖీ ప్రజా వేదిక' చిన్నంబావి

## - రూ.2.75 కోట్ల రూపాయల పనులపై సోషల్ ఆడిట్

**చిన్నంబావి, సెప్టెంబర్ 25 (ప్రజాజ్యోతి)** గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చిన్నంబావి మండలంలో చేపట్టిన రూ. 2.75 కోట్ల విలువైన పనులపై 5వ సామాజిక తనిఖీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సోషల్ ఆడిట్ ప్రజావేదికకు డీఆర్డీవో రాజేశ్వర్‌రెడ్డి, ఏపీడీ సయ్యద్ సుల్తాన్ హాజరై గ్రామాల వారీగా చేపట్టిన పనులు, ఖర్చులు, కూలీల హాజరు, వేతనాల చెల్లింపులు, రికార్డుల నిర్వహణపై సమీక్షించారు.సామాజిక తనిఖీలో భాగంగా రిసోర్స్ పర్సన్లు వారం రోజులుగా మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీల హాజరు, మస్టర్లు, వేతనాల చెల్లింపులు, రిజిస్టర్లు తదితర రికార్డులను తనిఖీ చేశారు. చేపట్టిన పనులు నిబంధనల ప్రకారం జరిగాయా? కూలీలకు వేతనాలు సక్రమంగా అందాయా? రికార్డుల్లో నమోదు చేసిన వివరాలకు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు పొంతన ఉందా? అనే అంశాలపై వివరాలు సేకరించి నివేదికలను ప్రజావేదికలో సమర్పించారు. రూ. 2.42 కోట్లు కూలీల వేతనాలు గత ఆర్థిక సంవత్సరంలో మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ. 2.75 కోట్లతో ఫీడర్ ఛానళ్లు, సీసీ రోడ్లు, ల్యాండ్ లెవెలింగ్, క్యాటిల్ షెడ్లు తదితర పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కూలీలకు రూ. 2.42 కోట్ల మేర వేతనాలు చెల్లించగా, రూ. 33.18 లక్షల మేర సామగ్రి వ్యయం జరిగినట్లు వివరించారు.ఉపాధి హామీ పథకం కింద పని కోరే ప్రతి కూలీకి నిబంధనల ప్రకారం పనులు కల్పించాల్సిందేనని జిల్లా అధికారులు స్పష్టం చేశారు. గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించరాదని, కూలీలకు నిరంతరం పని లభించేలా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని సూచించారు. పనులు నిర్వహించని గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి కారణాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఫీల్డ్ అసిస్టెంట్లు తమ పరిధిలోని గ్రామాల్లో కూలీలను సమీకరించి ఉపాధి పనులు సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులు ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే ఫీల్డ్ అసిస్టెంట్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు కూడా ఉపాధి హామీ పనుల నిర్వహణ, రికార్డుల పర్యవేక్షణలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.రికార్డుల నిర్వహణలో అలసత్వంపై ఆగ్రహంపలు గ్రామాల్లో రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, విధుల పట్ల అలసత్వం ఉన్నట్లు సోషల్ ఆడిట్ బృందాలు గుర్తించి నివేదికలు సమర్పించాయి. దీనిపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన మస్టర్లు, రిజిస్టర్లు, హాజరు, వేతనాల వివరాలు తదితర రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.ఉపాధి హామీ నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని, పనుల నిర్వహణలో అవకతవకలకు తావులేకుండా చూడాలని అధికారులు స్పష్టం చేశారు. సోషల్ ఆడిట్ ద్వారా గుర్తించిన లోపాలను సరిదిద్దడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారు ఎవరైనా బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన చోట పెనాల్టీలు వసూలు చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీవో రాజేశ్వర్‌రెడ్డి, ఏపీడీ సయ్యద్ సుల్తాన్, ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్‌గౌడ్, విజిలెన్స్ అధికారి సిరాజ్, హరిత, ఎస్టీఎం అంజగౌడ్, ఎంపీవో రామస్వామి, ఏపీవో ధనుంజయరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, డీఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.








# దీన్‌దయాళ్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

**గండీడ్, (ప్రజా జ్యోతి ):** పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని గండీడ్ మండలం సల్కర్‌పేట్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రధాన ఆశయాలని తెలిపారు. సమాజంలోని చివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేయడం, పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం ఆయన సిద్ధాంతాల సారాంశమన్నారు. గ్రామీణాభివృద్ధి, స్వదేశీ ఆలోచనలు, ఆత్మనిర్భరత, సామాజిక సమానత్వంతో కూడిన సమగ్ర అభివృద్ధి ఆయన ఆశయాల్లో ముఖ్యమైనవని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రజాసేవ చేస్తూ అంత్యోదయ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షుడు వెంకటేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రఘు, దీజేవీ అధ్యక్షుడు యాదగిరి, కోశాధికారి శ్రీనివాస్, సీనియర్ నాయకులు అంజిలయ్య, వెంకటేష్, శ్రీనివాస్, రవి, వార్డు సభ్యులు వీరేష్, నవీన్ యాదవ్, యువ నాయకుడు నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

## - నీటి సంరక్షణ, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి : అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 25 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి, వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ సూచించారు. గ్రామాల్లో నీటి సంరక్షణ, మౌలిక వసతుల కల్పన, జీవనోపాధి అభివృద్ధి, వర్షాభావ పరిస్థితుల నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల రూపకల్పనపై తొమ్మిది మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అడ్డాకల్, భూత్పూర్, చిన్నచింతకుంట, దేవరకద్ర, జడ్చర్ల, కోయిలకొండ, కౌకుంట్ల, మూసాపేట, రాజాపూర్ మండలాలకు చెందిన సర్పంచులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బందికి గ్రామాభివృద్ధి ప్రణాళికలపై అవగాహన కల్పించారు.

**నీటి భద్రతకు అత్యధిక ప్రాధాన్యం:**

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున భూగర్భ జలాల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా చెక్‌డ్యామ్‌లు, ఫామ్ పాండ్లు, పర్కొలేషన్ ట్యాంకులు, రీచార్జ్ నిర్మాణాలు, రీచార్జ్ బోర్‌వెల్లు, సోక్‌పిట్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.
నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల రీచార్జ్, వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యం పెంపు, పంటల వైవిధ్యీకరణ వంటి అంశాలను గ్రామాభివృద్ధి ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు.

**ఉపాధి కల్పనకు దోహదపడే పనుల గుర్తింపు:**

అక్టోబర్ 1 నుంచి 2027 జూన్ వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించడంతోపాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి దోహదపడే పనులను గుర్తించి, వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల్లో పొందుపరచాలని తెలిపారు. ముఖ్యంగా వి.బి.జి. రామ్‌జీ పథకం కింద చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు. గ్రామాల వారీగా ప్రణాళికలను సెప్టెంబర్ 30వ తేదీలోగా సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు.

**మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం:**

గ్రామాల్లో పాఠశాలలు, గ్రామ పంచాయతీ భవనాలు, వీఓ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రహరీ గోడలు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు వంటి మౌలిక అవసరాలను గుర్తించి ప్రణాళికల్లో చేర్చాలని అదనపు కలెక్టర్ సూచించారు. అక్టోబర్ 2న నిర్వహించనున్న గ్రామసభల్లో గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించి, అవసరమైన తీర్మానాలు చేయాలని తెలిపారు. గ్రామం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, గ్రామాభివృద్ధిలో సర్పంచులు పునాది వంటివారని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎదురయ్యే సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిధులు, సౌకర్యాలను పొందేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని, పరిష్కరించాల్సిన సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వ స్థాయిలో అవసరమైన






చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**శాఖలారీగా పథకాలపై అవగాహన:**

కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద నాయక్, మిషన్ భగీరథ ఇంట్రా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జయాబాయి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను వివరించారు. ఆయా శాఖల పథకాలకు అనుగుణంగా గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల్లో పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎఫ్‌ఏలు, టీఏలు, వి.బి.జి. రామ్‌జీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల మున్సిపాలిటీలో రూ.11 లక్షల పైగా నిధుల దుర్వినియోగం



**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 25:**

గద్వాల మున్సిపాలిటీలో షాపుల అద్దె వసూళ్ల సొమ్ము దుర్వినియోగానికి గురైన ఉదంతంపై మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్ స్పందిస్తూ ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీకి సంబంధించి అద్దెలు వసూలు చేసే బాధ్యత కలిగిన ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రూ.11లక్షలకు పైగా నిధులను దుర్వినియోగానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వ్యవహారంపై గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కమిషనర్ తెలిపారు.జరిగిన అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారులకు ప్రాథమిక నివేదికను సమర్పించారు. మున్సిపాలిటీలోని ఇతర ఆర్థిక లావాదేవీలను, రికార్డులను కూడా సమగ్రంగాపరిశీలిస్తున్నామని,పూర్తిస్థాయి విచారణ ముగిసిన తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

## మరణించిన ఉపసర్పంచ్ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం

**గండీడ్, (ప్రజా జ్యోతి):**



గండీడ్ మండలం చెలిమిల్లా గ్రామంలోని జిన్నారం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ ఈడిగి వెంకటయ్య గౌడ్ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న గండీడ్ మండల ఉపసర్పంచ్‌లు ఆయన భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం మృతుడి కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గండీడ్ ఉపసర్పంచ్ గుముడాల చెన్నయ్య, వెన్నచేడ్ ఉపసర్పంచ్ రవికాంత్ రెడ్డి, కొంరెడ్డిపల్లి ఉపసర్పంచ్ భీమయ్య, కాప్లాపూర్ ఉపసర్పంచ్ శ్రీనివాస్, చిన్నవార్వాల్ ఉపసర్పంచ్ రాములు, ఆశిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ హన్మంతు, జనంపల్లి ఉపసర్పంచ్ ఎరుకల కృష్ణయ్య, జిన్నారం తండా బీమిబాయి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# గూడెం గ్రామంలో భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు

### (సనాతన ధర్మ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

**చిన్నంబావి, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండలంలోని గూడెం గ్రామంలో సనాతన ధర్మ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.నిమజ్జనోత్సవం సందర్భంగా గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. భక్తుల జయజయధ్వానాలు, వినాయక నామస్మరణలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.భక్తి, ఐక్యతకు ప్రతీకగా ఉత్సవాలు ప్రతి ఏడాది గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని సనాతన ధర్మ యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు, యువత సమన్వయంతో ఈ ఏడాది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించి, నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా పూర్తి చేశామని పేర్కొన్నారు. ఉత్సవాలు గ్రామ ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా సాగాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ యూత్ కమిటీ సభ్యులు మద్దూరి నాగరాజు, మధకం కురుమయ్య, తోట బాలకృష్ణ, మేకల శివుడు, మద్దూరి ప్రవీణ్, మేకల సతీష్ యాదవ్, గొందిపర్ల మూర్తి, బాలకృష్ణ, బాలపీరు, మద్దూరి సత్తయ్య కుటుంబ సభ్యులతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.













# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు దర్శన్ ఎంపిక

**మాగనూర్, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ 12వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో భాగంగా ఈ నెల 17న నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో దర్శన్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. లాంగ్‌జంప్, రన్నింగ్, షాట్‌పుట్ మూడు విభాగాల్లో ప్రతిభ చూపి జిల్లాలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.ఈ నెల 26న హనుమకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో దర్శన్ జిల్లా తరపున పాల్గొననున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ రాకేష్ శర్మ తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ప్రధానోపాధ్యాయులు బాబు రెడ్డి, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు దర్శన్‌ను అభినందించారు.




# వేగంగా వచ్చి బైకును గుద్దిన బస్సు..... క్షణాల్లో ఆవిరైన ప్రాణం!!!!!!!!

**మహమ్మదాబాద్ సెప్టెంబర్ (25) ప్రజా జ్యోతి**

మహమ్మదాబాద్ మండలం దేశాయి పల్లి గ్రామానికి చెందిన కురువ మల్లేష్ వయస్సు (20)తండ్రి కిష్టయ్య తన ద్విచక్ర వాహనంపై సొంత పని నిమిత్తం కోస్గి బయలుదేరాడు. అదే క్రమంలో కోస్గి వైపు నుండి అతివేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు నెంబర్ టీఎస్ 06ఖజ 3213 బస్సు డ్రైవర్ దస్తయ్య తన బస్సుని అతివేగంగా అజాగ్రత్త గా నడుపుతూ వచ్చి మల్లేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య రత్నమాల ఫిర్యాదు మేరకు మహమ్మదాబాద్ ఎస్సై శేఖర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కన్న కొడుకు మృతి చెందటం తో తల్లి దండ్రుల రోదనలు మిన్నంటాయి.ఈ హృదయవిదారక ఘటన పలువురిని కంటతడి పెట్టించింది.





ప్రజాజ్యోతి

శనివారం సెప్టెంబర్ 26, 2026

# సైబర్ నేరాలపై అవగాహన చిన్నంబావి, ఎస్ఐ

**చిన్నంబావి, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి)**

మారుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, వారి వలలో చిక్కకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చిన్నంబావి ఎస్సై రామన్‌గౌడ్ సూచించారు.మండల పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'సురక్షా కా తిరంగ్' సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ప్రజలకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. బ్యాంకు అధికారులు, పోలీసులు, వివిధ సంస్థల ప్రతినిధుల పేర్లతో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి నమ్మించి డబ్బులు దోచుకుంటున్నారని తెలిపారు. తెలియని లింకులు, మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు నంబర్, పిన్, ఓటీపీ వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు.బహుమతులు,ఉద్యోగాలు, రుణాలు, ఇతర ఆకర్షణీయమైన ఆఫర్ల పేరుతో వచ్చే అనుమానాస్పద సందేశాలను నమ్మవద్దన్నారు. తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయడం వంటివి చేయకూడదని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పరిమితంగా పంచుకోవాలని, బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలని తెలిపారు.మోసపోతే వెంటనే 1930కు ఫోన్ చేయాలి సైబర్ మోసానికి గుర్తైన వారు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అప్రమత్తతతోనే సైబర్ మోసాలను అడ్డుకోవచ్చన్నారు.మైనర్లకు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు నడపడానికి తల్లిదండ్రులు ఇవ్వొద్దని ఎస్సై హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడుపుతున్నట్లు గుర్తిస్తే వాహనాలను సీజ్ చేసి, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. పిల్లల భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు కలగకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సై తో పాటు  హెడ్ కానిస్టేబుల్ జీవన్,పోలీసు సిబ్బంది, రాంబాబు, ఎండి గౌస్,అనిత, వాహనదారులు, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







# నర్వలో ఘనంగా గణేశుల నిమజ్జనోత్సవం

## డీజేల చప్పుళ్లతో దద్దరిల్లిన నర్వ

## డీజే ల ను నిషేధించాలనే కోర్టు ఆదేశాలు ధిక్కరణ

**నర్వ సెప్టెంబర్ 25 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలో శుక్రవారం గణేష్ నిమజ్జన ఉత్సవం ఘనంగా జరిగాయి, వినాయక పండుగ  సందర్భంగా నర్వ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏడు భారీ వినాయకలు 11 రోజుల పాటు పూజలు అందుకొని నిమజ్జనానికి తరలి వెళ్లాయి, ఈ సందర్భంగా నర్వలోని రామాలయం గణపతి, అంబేద్కర్ నగర  గణపతి, గొల్ల గిరి వాల్మీకి, తదితర గణనాకులను, డిజేల  పాటలతో యువకులు ఆటపాటలాడుతూ, గణనాథులకు స్వాగతం పలికి నిమజ్జనానికి తరలించారు, రాత్రంతా గ్రామం డీజే ల సౌండ్ తాకిరిలకు గ్రామ ప్రజలు తట్టుకోలేక  కొందరు  దూరంగా వెళ్లిపోవడం అరే ఇదేంటి రా బాబోయ్ బీజేలు లేకుండా ఉంటేనే బాగుంటుంది అనే విధంగా మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు





# 80 ఫీట్లు రోడ్డు ఉన్నచోటే ఆర్ఓబి..

## సెకండ్ రైల్వే గేట్ వద్ద కాకుండా, కిలోమీటర్ 186/6-7 వద్ద గల 80  అడుగుల రోడ్డులోనే  నిర్మాణం..

## స్థానికులు ఎవరు ఆందోళన చెందవద్దు..డికె.స్నిగ్ధ రెడ్డి

**ఆలంపూర్ సెప్టెంబర్ 25(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**




గద్వాల పట్టణంలోని డికె.బంగ్లా లో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో జిల్లా యువ నాయకురాలు  డికె. స్నిగ్ధ రెడ్డి మాట్లాడుతూరెండవ రైల్వే గేటు దగ్గర ఆర్.ఓబి నిర్మిస్తామని వచ్చిన వాటిని నమ్మవద్దని 80 ఫీట్ల రోడ్డు ఉన్నచోటే ఆర్.ఓబి నిర్మించడం జరుగుతుందని బిజెపి పార్టీ యువ నాయకురాలు డికె. స్నిగ్ధ రెడ్డి తెలిపారు. అదేవిధంగా మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ ఆదేశాల మేరకు రైల్వే శాఖ ఇచ్చిన జీవో ప్రకారం 80 ఫీట్ల రోడ్డు ఉన్నచోట ఆర్ఓబి నిర్మితం అవుతుందని రెండవ రైల్వే గేట్ ప్రాంతంలో ఉన్నవారు ఎలాంటి ఆందోళననకు గురి కావద్దని తెలిపారు. అలాగే సెకండ్ రైల్వే గేట్ వద్ద కాకుండా, కిలోమీటర్ 186/6-7 వద్ద గల 80 ఫీట్లు రోడ్డులోనే కొత్త ఆర్.ఓబీ నిర్మిస్తున్నట్లు రైల్వే శాఖ స్పష్టం చేసిందని తెలిపారు. పాత రికార్డుల వల్ల చిన్న కన్ఫ్యూజన్ తలెత్తిందని, క్షేత్రస్థాయి సర్వే ప్రకారం ఇదే సరైన ప్రదేశమని పేర్కొన్నారుఇందులో ఎవరు ఎలాంటి ప్రకటనలు చేసిన చెల్లవని తుది నిర్ణయం రైల్వే శాఖ ఇచ్చిన 80 ఫీట్ల రోడ్డు వద్ద ఆర్ఓబి నిర్మిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, గద్వాల పోటీ చేసిన అభ్యర్థి బలిగేరా శివారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ,జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి,ఓబీసీ మోర్చా,దేవా దాస్  కౌన్సిలర్ చంద్రశేఖర్ మహిళా మోర్చా సంధ్యా, భారతి సీనియర్ నాయకులు మీర్జాపురం వెంకటేస్వర రెడ్డి, మధు గౌడ్, నరసింహాశెట్టి,తదితరులు హాజరయ్యారు..